సాక్షి
నారాయణపేట

గురువారం । 9 । మార్చి । 2023



మార్మోగిన శివనామస్మరణ

కందూర్ రామలింగేశ్వరస్వామి రథోత్సవం శివనామస్మరణతో మార్మోగింది.

వివరాలు 10లో ▸



రమణీయం.. రథోత్సవం

మన్యంకొండ అలివేలు మంగతాయారు రథోత్సవం వైభవంగా నిర్వహించారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34.2 /20.3

ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం తీవ్రత పెరిగి ఉక్కపోత పెడుతుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పోలింగ్ స్టేషన్ పరిశీలన



మద్దూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మద్దూరులోని పోలింగ్ స్టేషన్ నంబర్ 46ను అడిషన్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ బుధవారం పరిశీలించారు. స్థానిక బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ఏర్పాట్ల గురించి తహసీల్దార్ రవిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ బాక్స్‌లు, ఓటు వేసేందుకు ఏర్పాట్ల విధానంపై సూచనలు చేశారు. ఈయన వెంట డీఎస్పీ సత్యనారాయణ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఉదయ్‌శంకర్, ఆర్ఐ శ్రీనివాస్‌గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు

నారాయణపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13న పాలమూరు, రంగారెడ్డి, హైదరాబాద్‌కు సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నందున ఒకరోజు ముందే సిబ్బంది ఎన్నిక కేంద్రానికి చేరుకునేటట్లు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రాంచందర్‌నాయక్, ఏఓ నర్సింగ్‌రావు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

13న ప్రజావాణి రద్దు

నారాయణపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ఈనెల 13న సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్పును జిల్లా ప్రజలు గమనించి ఎవరూ ప్రజావాణి ఫిర్యాదులతో రావద్దని సూచించారు. తర్వాత ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా ఉంటుందని పేర్కొన్నారు.

పెసలు క్వింటా రూ.7,459

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పెసలు క్వింటా ధర గరిష్ఠంగా రూ.7,459, కనిష్ఠంగా రూ.7,271 పలికింది. శనగలు క్వింటా గరిష్ఠంగా రూ.4,851, కనిష్ఠంగా రూ.4,759, వేరుశనగ గరిష్ఠంగా రూ.6,309, కనిష్ఠంగా రూ.3,069, జొన్నలు గరిష్ఠంగా రూ.4,621, కనిష్ఠంగా రూ.3,200, పెబ్బర్లు గరిష్ఠంగా రూ.6,411, కనిష్ఠంగా రూ.6,219, ఎర్ర కందులు గరిష్ఠంగా రూ.8,352, కనిష్ఠంగా రూ.8,329, తెల్లకందులు రూ.8,469, తెల్లకుసుమలు గరిష్ఠంగా రూ.4,502, కనిష్ఠంగా రూ.4,229 పలికింది.

కిట్లు లేవు.. నగదు లేదు!

ఇబ్బందుల్లో కేజీబీవీ విద్యార్థినులు



మరికల్‌లోని కేజీబీవీ విద్యార్థినులు



- ఆరోగ్య కిట్లకు బదులు నగదు ఇస్తామంటూ బ్యాంకు ఖాతా నంబర్ల సేకరణ
- రెండేళ్లు గడుస్తున్నా అందని డబ్బు
- జిల్లాలో 11 కేజీబీవీలు, 3,250 మంది విద్యార్థినులు

> **బ్యాంకు ఖాతా నంబర్లు పంపాము..**
>
> కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మూడు నెలలకు ఒకసారి ఇచ్చే ఆరోగ్యకిట్ల స్థానంలో వారి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేయడం కోసం అకౌంట్ నంబర్లను సేకరించి పంపాము. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా కూడా ఆరోగ్య కిట్లకు సంబందించిన నగదును విద్యార్థినులు ఖాతాలో జమకాలేదు. ఈ విషయాన్ని ప్రతి సమావేశంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం.
>
> – పద్మనళిని, జీసీడీఓ, నారాయణపేట

మరికల్: కస్తుర్బాగాంధీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినుల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. ఇక్కడ చదివే వారంతా బాలికలు కావడంతో వారి ఆరోగ్యపరంగా వచ్చే మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఐదేళ్ల క్రితం ప్రతి మూడు నెలలకోసారి ఆరోగ్య కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. కానీ రెండేళ్లుగా అందించడం లేదు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇవ్వాల్సిన ఆరోగ్యకిట్లు అందక కేజీబీవీ విద్యార్థినులు ఆరోగ్య పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ చదువుకుంటున్న వారు నిరుపేదలు కావడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. కొబ్బరినూనె, స్నానం, డిటర్జెంట్ సబ్బులు, రుతురుమాళ్లు సొంతంగా డబ్బుపెట్టి కొనుగోలు చేయలేకపోతున్నారు.

ఆరోగ్యకిట్ల స్థానంలో విద్యార్థినులు బ్యాంకు ఖాతాలో నెలనెలా రూ.100 జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో అధికారులు విద్యార్థినులచే బ్యాంకు ఖాతాలను తెరిపించి, వివరాలను సంబంధిత శాఖకు అందజేశారు. కానీ ఇప్పటి వరకు ఒక్కరి ఖాతాలో కూడా డబ్బులు జమ కావడం లేదు. జిల్లాలో 11 కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలు ఉన్నాయి. 3,250 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ప్రభుత్వం గతంలో కాస్మోటిక్ చార్జీల కింద ఒక్కో విద్యార్థినికి నెలకు రూ.వంద చొప్పున

బ్యాంకు ఖాతాల్లోకే డబ్బులన్నారు..

ఇచ్చేది. వీటితో కొబ్బరినూనె, స్నానం సబ్బులు, డిటర్జెంట్ సబ్బులు మొదలైనవి కొనుగోలు చేసేవారు. అయితే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మూడు నెలలకు ఒకసారి రూ.300 విలువ చేసే ఆరోగ్య కిట్లు అందజేసింది. అందులో కొబ్బరినూనె, సబ్బులు, రిబ్బన్లు, పౌడర్, శానిటేషన్ న్యాప్ కిన్లు తదితర 15 రకాల వస్తువులు అందజేశారు. కోవిడ్–19కి ముందు వరకు వీటిని సంక్రమంగా పంపిణీ చేశారు. తర్వాత పాఠశాలలు తెరుచుకున్నా ఆరోగ్య కిట్ల పంపిణీ నిలిపివేశారు. కరోనా అదుపులోకి వచ్చిన తర్వాత 2021 సెప్టెంబర్ 1 నుంచి మళ్లీ విద్యాసంస్థలు తెరిచి ప్రత్యక్ష తరగతులు నిర్వహిస్తున్నారు. కానీ ఇప్పటివరకు ఆరోగ్య కిట్లు రాలేదు. కేజీబీవీల్లో పేద విద్యార్థినులు, తల్లిదండ్రులు వలస వెళ్లిన బాలికలు, అనాథలే అధికంగా ఉంటున్నారు. వీరికి ఆరోగ్యకిట్లు అందక సొంతంగా కొనుగోలు చేయలేక ఇబ్బందులు గురవుతున్నారు.

మహిళలు రాణిస్తే సమాజం అభివృద్ధి

నారాయణపేట రూరల్: మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని డీఈఓ లియాకత్ అలీ అన్నారు. స్థానిక శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. జెడ్పీ సీఈఓ జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి కన్యాకుమారి, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి (జీసీడీఓ) పద్మనళినితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యారంగంలో మహిళా టీచర్ల సహకారంతో ఎన్నో విజయాలు నమోదు చేస్తుండటం ఎంతో అభినందనీయమన్నారు. అలాంటి సందర్భాల్లోనే దిశ వంటి సంఘటనలు జరగవని, పిల్లలకు క్రమశిక్షణ, మానవీయ విలువలు నేర్పించడంలో తల్లి, గురువు బాధ్యత ఎంతో ఉందన్నారు. అంతకుముందు నిర్వహించిన పోటీల విజేతలకు



మాట్లాడుతున్న డీఈఓ లియాకత్ అలీ

బహుమతులు అందించారు. అనంతరం వివిధ రంగాల్లో కృషి చేస్తున్న మహిళలను శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహ, పారిజాత, జ్యోతి, అపర్ణ, నర్మద, రాధ, జానకి, రాధిక, కృష్ణవేణి, అంబిక, జయలక్ష్మి పాల్గొన్నారు.

లింగ సమానత్వం ఎంతో అవసరం

నారాయణపేట రూరల్: సమాజంలో లింగ సమానత్వం ఎంతో అవసరమని జెడ్పీ సీఈఓ జ్యోతి అన్నారు. నారాయణపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం పీఆర్‌టీయూ మహిళా టీచర్లు నిర్వహించిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవానికి డీఈఓ లియాకత్ అలీ, జీసీడీఓ పద్మనళినితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పక్కా ప్రణాళికతో పాటు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు పోవాలని సూచించారు. మహిళలు చైతన్య వంతమై బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలను అడ్డుకోవాలన్నారు. అంతకుముందు వివిధ క్రీడాపోటీల విజేతలకు బహుమతులు అందించి, శాలువా, మెమెంటో అందించి సత్కరించా రు. పీఆర్‌టీయూ నాయకులు జనార్దన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వరలక్ష్మి, వాణిశ్రీ, శశికళ, అన్నపూర్ణ, మాధ వి, రాధిక, భీమేశ్వరి, స్నేహలత, సునీత, రఘువీర్, మొల్గాన్‌జనార్దన్, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

● మంత్రిపై తిరుగుబావుటా..

బీఆర్‌ఎస్‌కు షాక్..!

- రాజీనామాకు సిద్ధమైన వనపర్తి జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి
- మరో ఇద్దరు ఎంపీపీలు, ఓ వైస్ ఎంపీపీ సైతం..
- వీరి బాటలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు
- నేడు ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపూర్‌లో భేటీ
- అక్కడి నుంచే తదుపరి కార్యాచరణ వెల్లడించే అవకాశం





లోక్‌నాథ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్



మేఘారెడ్డి, ఎంపీపీ



కిచ్చారెడ్డి, ఎంపీపీ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/వనపర్తి: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సొంత ఇలాకా వనపర్తి జిల్లాలో భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)కి భారీ షాక్ తగిలింది. మంత్రికి అత్యంత సన్నిహితులుగా ముద్రపడిన ముఖ్య నాయకులు జెడ్పీచైర్మన్ ఆర్.లోక్‌నాథ్ రెడ్డి.. వనపర్తి, పెద్దమందడి ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డితో పాటు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఐ.సత్యారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ సాయిచరణ్ రెడ్డి రాజీనామాకు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపూర్‌లో గురువారం వారు భేటీ కానున్నారు. అదే వేదికగా తదుపరి కార్యాచరణ వెల్లడించనున్నట్లు ప్రకటించడం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇటీవలే శస్త్ర చికిత్స చేయించుకున్న మంత్రి హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటుండగా.. ఈ సమయంలో వీరు తిరుగుబావుటా ఎగురవేయడంపై చర్చ జోరుగా సాగుతోంది. వీరితో పాటు గ్రామ, మండలస్థాయిలో ముఖ్యులు అధికసంఖ్యలో పార్టీ వీడేలా భారీ స్కెచ్ వేశారని చర్చించుకుంటున్నారు. అయితే వైస్ ఎంపీపీ ఒకరు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు బీఆర్‌ఎస్‌ను వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

చినికి చినికి గాలివానలా..

జిల్లాలో ప్రధానంగా వనపర్తి నియోజకవర్గంలో మంత్రి, ముఖ్య నేతల మధ్య ఎప్పటినుంచో కొంత గ్యాప్ ఉంది. ఇటీవల వరుసగా చోటుచేసుకున్న ఘటనలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. అయితే గతేడాది డిసెంబర్ ఐదో తేదీన నిధుల కేటాయింపుల విషయంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వేదికగా విభేదాలు భగ్గుమన్నాయి. మంత్రి, జెడ్పీ చైర్మన్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పాటు పెద్దమందడి మండల నాయకులతోనూ మంత్రికి విభేదాలు నెలకొన్నాయి. మంత్రికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియో పోస్ట్ చేశారనే కారణంతో ఎంపీపీ మేఘారెడ్డి అనుచరుడిని పోలీసులు తీసుకెళ్లారు. అతడిని విచక్షణారహితంగా బెల్ట్‌పట్టాతో కొట్టగా ఆస్పత్రి పాలయ్యాడు. దీనిపై వారు ఇప్పటికే మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. మంత్రి ప్రోద్బలంతోనే పోలీసులు కిరాతకంగా వ్యవహరించారని మేఘారెడ్డి ఇప్పటికే ఫైర్ అయ్యారు. ఇలా మంత్రికి, వారి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఈ క్రమంలో నియోజకవర్గవ్యాప్తంగా మంత్రిపై అసంతృప్తిగా ఉన్న నాయకులందరూ ఏకమై పార్టీని వీడేందుకు మూడు నెలలుగా కసరత్తు చేసినట్లు తెలుస్తోంది. ఈ నెల ఏడో తేదీన శ్రీరంగాపూర్ మండలకేంద్రంలోని నిర్వహించిన రంగనాయకస్వామి రథోత్సవంలో వనపర్తి సంస్థానాధీశులైన రాజా కృష్ణదేవరావుతో అసమ్మతి నేతలు సుదీర్ఘ చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ విషయం ఇప్పటికే పలు వాట్సాప్ గ్రూప్‌లలో చక్కర్లు కొడుతోంది.

> **సెంటిమెంట్‌గా భావించే చోటు నుంచే..**
>
> జిల్లాకు, నియోజకవర్గంతో పాటు మండలానికి ఈశాన్య ప్రాంతమైన సల్కెలాపురం వేదికగా రాజీనామా ప్రకటించనున్నట్లు అసంతృప్త నేతలు వెల్లడించారు. మంత్రి నిరంజన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఖిల్లాఘనపురం మండలం గట్టుకాడిపల్లిలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేసి నామినేషన్ వేయడం సెంటిమెంట్‌గా వస్తోంది. మంత్రితో సన్నిహితంగా ఉండి ఆయన గెలుపు కోసం కృషి చేసిన అసంతృప్త నాయకులు సైతం ఈ మండలం వేదికగా సామూహిక రాజీనామాలకు ముహూర్తం ఖరారు చేయడం విశేషం. రాజీనామా చేసే వారి పేర్లు వెల్లడి కాకున్నా.. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు అధికసంఖ్యలో ఉన్నట్లు సమాచారం. ఈ సమాచారం తెలుసుకున్న మంత్రి అనుచరులు ఇప్పటికే పలువురిని బుజ్జగించేందుకు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.

> **మంత్రికి చేటు చేసేనా?**
>
> గత అసెంబ్లీ ఎన్నికల్లో నిరంజన్‌రెడ్డి గెలుపు కోసం వ్యయప్రయాసలు ఎదుర్కొన్న నాయకులే ఖిల్లా కోట సాక్షిగా ఆయనపై రాజకీయ యుద్ధం ప్రకటించేందుకు సిద్ధం కావడంపై 'గులాబీ' శ్రేణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, అసంతృప్త నాయకులు బీజేపీలో చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మండలాలు, గ్రామాల వారీగా అనుచరులు, కార్యకర్తల అభిప్రాయం తీసుకుంటామని.. ఆ మేరకే ఏ పార్టీలో చేరాలో నిర్ణయిస్తామని.. ఆత్మాభిమానం చంపుకోలేకే బీఆర్‌ఎస్‌ను వీడుతున్నట్లు ఓ అసంతృప్త నేత వెల్లడించారు. అయితే నియోజకవర్గంలో ఇప్పటి వరకు తిరుగులేని నాయకుడిగా పేరు తెచ్చుకున్న మంత్రి నిరంజన్‌రెడ్డికి ప్రస్తుత పరిణామాలు చేటు చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

రాష్ట్రంలో కల్వకుంట్ల రాజ్యాంగం



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో డీకే అరుణ, జితేందర్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే సామాన్యులు బతకలేరు
- కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

పాలమూరు: నాలుగున్నర కోట్ల ప్రజల భవిష్యత్‌కు సంబంధించిన అంశాలకు సంబంధించి రాష్ట్ర మంత్రి మండలి సమావేశాల్లో కాకుండా ప్రగతిభవన్ డైనింగ్ టేబుల్‌పై నిర్ణయాలు జరుగుతున్నాయని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఇదే పాలన భవిష్యత్‌లో ఉంటే రాష్ట్రంలో సామాన్యులు బతకలేరని అన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా కల్వకుంట్ల రాజ్యాంగం అమలవుతోందని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంతో పాటు సుదర్శన్‌గార్డెన్స్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతిభవన్‌లోకి ఎంఐఎం నాయకుల మోటార్ సైకిళ్లు వెళ్లినా.. డోర్లు వెంటవెంటనే తెరుచుకుంటాయని, ఇతరులకే కనీసం అపాయిట్‌మెంట్ కూడా దొరకదన్నారు. అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం తన వైఫల్యాలను, చేతగానితనాన్ని, అవినీతి కార్యక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి అనేక నాటకాలకు తెర తీసిందని..అందులో భాగంగానే టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్పుచేశారని విమర్శించారు. దేశానికి ఆదర్శంగా ఉంటామని చెబుతున్న ఈ బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ నుంచి గెలుపొందిన 12 మంది ఎమ్మెల్యేలతో పాటు టీడీపీ, వైఎస్సార్‌సీపీ వారిని పార్టీలో ఎందుకు కలుపుకున్నారని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని ఇసుక, లిక్కర్ మాఫియా శాసిస్తోందని, ధరణి అధర్మంగా మారిందని, ఎన్నికలు పూర్తిగా కలుషితం చేశారని ఆరోపించారు.

> **ప్రశ్నించే అభ్యర్థిని గెలిపించండి**
>
> శాసనమండలి సమావేశాల్లో 9 ఏళ్లగా ఉపాధ్యాయుల సమస్యలపై ప్రశ్నించే పరిస్థితి లేకుండాపోయిందని, అసలు ప్రతిపక్షం లేకుండా కుట్రలు చేసి పార్టీలోకి కలుపుకోవడం ఏమిటని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు నేడు ఆత్మగౌరవంగా బతుకుతున్నారా అని ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులంటే సమాజాన్ని జాగ్రత్తపరిచే వ్యక్తులని ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. అలాంటి వారి అస్తిత్వమే లేకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్వపరిచిందన్నారు. నెలనెలా జీతం సమయానికి వస్తుందో లేదో అని ఆత్రుతతో ఎదురు చూసే దీనస్థితిలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏవీఎన్ రెడ్డికి మద్దతు పలికి ఉపాధ్యాయ సమస్యలపై శాసనమండలిలో గళం వినిపించేలా చేయాలని కోరారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తీసుకునే నిర్ణయం తెలంగాణ సమాజానికి మేలు కోరే విధంగా ఉండాలని సూచించారు. సమావేశాల్లో జాతీయ కార్యవర్గసభ్యులు ఏపీ జితేందర్ రెడ్డి, మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, నాయకులు ఎగ్గని నర్సింహులు, పద్మజారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అశ్వత్థామారెడ్డి, ఎన్‌పీ వెంకటేష్, శ్రీవర్ధన్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలను అన్నిరంగాల్లో ప్రోత్సహించాలి



కేక్ కట్‌చేస్తున్న మహిళా అధికారులు చిత్రంలో కలెక్టర్ శ్రీహర్ష, అదనపు కలెక్టర్, అధికారులు

నారాయణపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మహిళా అధికారులతో కేక్‌ను కట్ చేయించారు. మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ అన్నిరంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, వారి హక్కులపై అవగాహన కల్పించడానికి అనేక కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్, జిల్లా అధికారులు జ్యోతి, పద్మానళిని, దేవసేన, కన్యాకుమారి, గోపాల్‌నాయక్, క్రిష్ణమచారి, జాన్‌సుధాకర్, హతిరాం, మురళి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు సన్మానం..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కె.వనజ ఆంజనేయులు గౌడ్‌మంతన్‌గోడ్ గ్రామంలో జెడ్పీ కార్యాలయ అధికారులు, సిబ్బంది శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జ్యోతి, జిల్లా పరిషత్ మినిస్టీరియల్ సంఘం సభ్యులు, జీసీడీఓ పద్మానళిని తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

అదేవిధంగా జిల్లా ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంజిత్‌కుమార్ పాల్గొని ఆరోగ్య అవగాహన కల్పించారు. హెచ్ఐవీ బాధితులు 50 మందికి వస్త్రాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఐసీటీసీ ఎం.సుధాకర్‌బాబు, లింక్ వర్కర్స్ స్కీమ్, వైఆర్‌జీ సిబ్బంది చెన్నయ్య, కార్తిక్ పాల్గొన్నారు.

> **జిల్లా కోర్టు ఆవరణలో..**
>
> జిల్లా కోర్టు ఆవరణలో లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, అబ్దుల్ రఫీ, సీనియర్ సివిల్ జడ్జి జి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ ఉమర్, అడిషన్ జూనియర్ సివిల్‌జడ్జి జకియాసుల్తానా మాట్లాడారు. అమ్మాయిలు శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా బలపడాలన్నారు. అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని చెప్పారు. ప్రపంచంలో స్ఫూర్తిదాయకమైన మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్, ఉపాధ్యక్షులు నందునామాజి, ఏజీపీ సతీష్‌కుమార్‌గౌడ్, పీపీ సురేష్, న్యాయవాది నాగేశ్వరి, హాజమ్మ, పారాలీగల్ వలంటీర్లు, ఇతర మహిళలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- విజేఆర్ వ్యవస్థాపకుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మక్తల్: నియోజకవర్గంలో పునరావాస గ్రామాలు భూత్పూర్, నేరడుగం, ఉజ్జెల్లి గ్రామాలకు నష్టపరిహారం చెల్లించాలని బీఆర్‌ఎస్ నాయకుడు, వీజేఆర్ వ్యవస్థాపకుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. మక్తల్‌లో బుధవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మక్తల్ నియోజకవర్గంలో విద్య, వైద్యం వెనుకబడి పోయిందని అన్నారు. కేసీఆర్ నుంచి వచ్చిన పథకాలే ప్రజలకు ఉపయోగపడ్డాయని అన్నారు. సొంతంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు ఏమాత్రం తీసుకొని రాలేదని అన్నారు. నారాయణపేట, దేవరకద్ర అభివృద్ధిలో ముందుకు పోతున్నాయని, మక్తల్ అభివృద్ధిలో వెనుకంజలో ఉందన్నారు.

వీజేఆర్ ఆధ్వర్యంలో..

నియోజకవర్గంలో అందరికి కాకుండా నాశక్తి మేరకు నిరుపేదలకు ఆర్థిక సాయంతో పాటు ఇంటి సామగ్రిని, నిత్యావసర వస్తువులు, తాగునీటి సరఫరా, విద్యార్థులకు బుక్స్, స్మార్ట్ టీవీ, కంప్యూటర్లు, రకరకాలుగా సాయం అందిస్తామన్నారు. ఆటంకం కల్గించిన వ్యక్తికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. తనకు అవకాశం ఇస్తే మక్తల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా సస్యశ్యామలం చేస్తానని అన్నారు. మక్తల్ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తానని అన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటానన్నారు.



మక్తల్‌లో మాట్లాడుతున్న వీజేఆర్ వ్యవస్థాపకుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో బాలుడు మృతి


యల్లలింగా (ఫైల్)

కృష్ణా: విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతి చెందాడు. మండలంలోని హిందూపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఆ వివరాలు.. గ్రామానికి చెందిన దండమోళ్ల మాళప్ప కుమారుడు యల్లలింగా (7) బుధవారం సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన తర్వాత తోటి స్నేహితులతో ఇంటి పక్కనే క్రికెట్ ఆడాడు. బాల్ వారి ఇంటి పక్కన ఉన్న ఇంటి మిద్దెపై పడడంతో తేవడానికి వెళ్లాడు. అక్కడే విద్యుత్‌వైర్ తెగిపోయి ఉండటాన్ని గమనించని ఆ బాలుడు తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి..

గద్వాల క్రైం: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ అబ్దుల్‌షుకూర్ తెలిపారు. రాజోళి మండలానికి చెందిన బీసీరెడ్డి(60) బార్ అండ్ రెస్టారెంట్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం సమయంలో కొత్తబస్టాండ్ వెలుపల అనుమానాస్పదంగా మృతిచెంది కనిపించినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతుడి వద్ద ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా బీసీరెడ్డిగా గుర్తించారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపర్చామని, కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాల్వలో పడి..

పాన్‌గల్: మద్యం మత్తులో డ్రెయినేజీలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని రేమద్దుల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దాసర్ల వెంకటయ్య(48) మంగళవారం రాత్రి మద్యం మత్తులో నడుచుకుంటూ ఇంటికి వెళ్తూ రోడ్డు పక్కన గల డ్రెయినేజీలో పడి చనిపోయాడు. బుధవారం గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని డ్రెయినేజీలో నుంచి మృతదేహాన్ని తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: హోలీ పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కేసరిసముద్రం చెరువులో స్నానం చేసేందుకు వెళ్లిన వ్యక్తి గల్లంతైన సంఘటన విధితమే. ఆ వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైనట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన వినయ్(22) హోలీ పండుగ ముగిసిన తర్వాత స్నానం చేసేందుకు కేసరిసముద్రం చెరువులోకి దిగాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడి మునిగిపోయాడు. అగ్నిమాపకశాఖ సిబ్బంది మంగళవారం రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించలేదు. బుధవారం మధ్యాహ్నం మరోసారి గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మీ ట్రాక్టర్లు మాకొద్దు.. డీజిల్ పోయలేం

- చేతులెత్తేసిన సర్పంచ్‌లు
- ఎన్నాళ్లు ఇబ్బందులు పడాలి
- ట్రాక్టర్లతో మల్టీపర్పస్ వర్కర్ల ఆందోళన


ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మల్టీపర్పస్ కార్మికులు


ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిలిపిన ట్రాక్టర్లు

గండేడ్: డీజిల్ భారం మోయలేమని ఓవైపు సర్పంచ్‌లు చేతులెత్తేశారు. మరోవైపు నాలుగైదు నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే పూట ఎలా గడుస్తుందని, ఎన్నాళ్లీ ఇబ్బందులు పడాలంటూ మల్టీపర్పస్ వర్కర్లు ఇటీవల ఆందోళనకు దిగారు. గండేడ్ మండల కేంద్రంలో ఈ తంతు చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గండేడ్, మహమ్మదాబాద్ మండలాలకు చెందిన ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఇటీవల ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలు ఎకరువు పెట్టారు. నిధులు అంతంతమాత్రంగానే రావడం, వచ్చినా.. నెలల తరబడి ఫ్రీజింగ్‌లు ఉండడంతో తాము పారిశుద్ధ్య పనులు కూడా చేయడం భారంగా మారిందన్నారు. గ్రామంలో వసూలు చేసిన పన్నులు సైతం ఖాతాల్లో జమచేయడం తప్ప.. చిన్న అవసరాలకు వాడుకోలేకపోతున్నామని వాపోయారు. కనీసం ట్రాక్టర్లకు డీజిల్ కూడా పోయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల్లో తమ సమస్య పరిష్కరించకుంటే తాము ట్రాక్టర్లను తీసుకొచ్చి ఎంపీడీఓ కార్యాలయానికి అప్పగిస్తామని చెప్పి ఈ మేరకు ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డికి వినతి అందజేశారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో రెండు మండలాలకు చెందిన దాదాపు 25 గ్రామపంచాయతీలకు చెందిన ట్రాక్టర్లను తీసుకొచ్చి ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఇటీవల నిలిపివేశారు. దీంతో పాటు మల్టీపర్పస్ వర్కర్లు సైతం వచ్చి ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఉదయం 12 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు కార్యాలయం వద్ద వేచి ఉన్నారు. విషయం తెలుసుకున్న డీపీఓ మండల ఎంపీఈఓతో మాట్లాడారు. ఆందోళన చేపట్టవద్దని వేచి ఉండాల్సిందిగా కోరారు. దీంతో పలువురు సర్పంచ్‌లతో ఎంపీఈఓ మాట్లాడారు. నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా ఎవరూ వినలేదు. ఇది రాష్ట్ర స్థాయి సమస్య అని, ఎవరూ ఆందోళన చేయనిది.. మీరు ఎందుకు చేస్తున్నారని అడిగారు. డబ్బు లేకపోతే పారిశుద్ధ్య పనులు ఎలా చేయాలని, కార్మికుల వేతనాలు ఎలా ఇవ్వాలని, డీజిల్ ఎలా పోయించాలని నిలదీశారు. డీపీతో మాట్లాడాలని పలువురు సర్పంచ్‌లను ఎంపీఈఓ కోరగా.. వారు అందుకు నిరాకరించారు. దీనికి తోడు మల్టీపర్పస్ వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు.

వేతనాలు పెంచాలి..

తమ వేతనాలు వెంటనే ఇవ్వాలని, పని విధానాన్ని గుర్తించాలని, వేతనం కూడా రూ.8,500 నుంచి రూ.24,000 పెంచాలని, సమయానికి వేతనాలు ఇవ్వాలని, కొన్ని చోట్ల కార్యదర్శులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దీనిని అరికట్టాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీఈఓతో వాగ్వాదం చోటుచేసుకుంది. మీకు మాత్రం ప్రతినెల వేతనాలు వస్తాయి, మాకేందుకు రావని నిలదీశారు. అనంతరం వారు ఎంపీఈఓ శంకర్‌నాయక్‌కు వినతి అందజేశారు. వారం రోజులు గడువు ఇవ్వాలని, మీసమస్య పరిష్కరించేలా చూస్తామని ఎంపీఈఓ చెప్పడంతో ఆందోళన విరమించారు. ఇకముందు సమస్య పరిష్కరించకుంటే జిల్లా స్థాయిలో ఆందోళన చేపడ్తామని మల్టీపర్పస్ కార్మికులు హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జితేందర్‌రెడ్డి, వెంకటయ్య, పుల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, కిరణ్ , రవీందర్, ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు నారాయణ, రాఘవేందర్‌రెడ్డి, దళిత శక్తి ప్రోగ్రాం జిల్లా ఇన్‌చార్జ్ పసుల శ్రీనివాస్ ఆయా గ్రామాల మల్టీపర్పస్ వర్కర్లు పాల్గొన్నారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



నిధులు అరకొరగా ఉంటున్నాయి. గ్రామపంచాయతీకి రావాల్సిన నిధులు కూడా పూర్తి స్థాయిలో రావడం లేదు. పన్నులు వసూలు చేసి కూడా జీపీ అకౌంట్‌లోనే వేస్తున్నాం. ఉన్న నిధులను ఆయా పనులకు వినియోగిద్దామనుకుంటే నెలల తరబడి ఫ్రీజింగ్ ఉంటుంది. నెలకు గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులు, కరెంటు, డీజిల్, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు కలిసి సుమారు రెండు నుంచి మూడు లక్షల వరకు వస్తుంది. అన్ని డబ్బులు పెట్టాలంటే ఎక్కడి నుంచి తెస్తాం. చివరకు డీజిల్ కూడా పోయించలేని పరిస్థితి నెలకొంది.

– గంగుల పుల్లారెడ్డి, సర్పంచ్, వెన్నాచేడ్

4నెలల నుంచి వేతనం రాలేదు..

గాధిర్యాల్ గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్నాను. నాలుగు నెలలుగా జీతం రాలేదు. దీంతో పూట గడవడం కష్టంగా ఉంది. ఒకటి లేదా రెండు నెలల వరకు అయితే ఎలాగోల సర్దుకుంటాం. కాని నెలల తరబడి ఇవ్వకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తుంది. పని మాత్రం ఒక్క రోజు విశ్రాంతి లేకుండా చేస్తున్నాం. కాని పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదు. ఇచ్చేది కూడా సకాలంలో ఇవ్వడం లేదు.

– గుముడాల అనంతయ్య, పంచాయతీ కార్మికుడు, గాధిర్యాల్ గ్రామపంచాయతీ

ఓపెన్ ప్లాట్లపై నేడు ప్రీ బిడ్ సమావేశం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అమిస్తాపూర్, పోతుల మడుగు టౌన్ షిప్ లలోని ఖాళీ ప్లాట్ల బహిరంగ వేలంపై గురువారం ప్రీ బిడ్ మీటింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ రవి నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ లో ఉన్న సారిక టౌన్‌షిప్, పోతులమడుగు వద్ద ఉన్న పోతులమడుగు టౌన్ షిప్ లలోని ఓపెన్ ప్లాట్లకు నిర్వహించనున్న బహిరంగ వేలం దృష్ట్యా ఈనెల 9 న కలెక్టరేట్‌లోని జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ప్రీ బిడ్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఓపెన్ ప్లాట్ల కు బహిరంగ వేలం..

ఓపెన్ ప్లాట్లకు మహబూబ్‌నగర్‌లోని బాదం సరోజిని ఆడిటోరియంలో మార్చి16 నుంచి 18 వరకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. సారిక టౌన్ షిప్‌లో ఉన్న 96 ప్లాట్లు 60 చదరపు గజాలు మొదలుకొని, 266 చదరపు గజాల వరకు ఉన్నాయని తెలిపారు. వీటికి కనీస ధర రూ.7వేలు మరియు రూ.8వేలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పోతులమడుగులోని 160 ఓపెన్ ప్లాట్లు 140 చదరపు గజాలు మొదలుకొని 400 చదరపు గజాలు వరకు ఉన్నాయని, వీటికి కనీస ధర రూ.5,500 మరియు రూ.6,000ల వరకు నిర్ణయించినట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ధరావత్తు కింద రూ.10,000 చెల్లించాలని సూచించారు. సైటుకు సంబంధించిన వివరాల బ్రోచర్లను ప్రి బిడ్ సమావేశంలో పొందవచ్చని తెలిపారు. వెబ్ సైట్ https://mahabubnagar.telangana.gov.in, unda.gov.in./auctions/triic.telangana.gov.in, swagruha.telangana.gov.in ఫోన్ నంబర్లు 08542-241165, 7675075365 లేదా 7993455775కు సంప్రదించవచ్చని తెలిపారు.

జల్సాల కోసం విద్యుత్ మోటార్లు చోరీ


స్వాధీనం చేసుకున్న మోటార్లు, నిందితులతో పోలీసులు

- వాహనాల తనిఖీలో కాపర్ వైర్‌తో పట్టుబడిన ఆటో
- 17 విద్యుత్ మోటార్లు అపహరించిన ముగ్గురు యువకులు

పెబ్బేరు: జల్సాలకు అలవాటు పడిన ముగ్గురు ముఠాగా ఏర్పడి విద్యుత్ మోటార్ల చోరీకి పాల్పడుతున్నారు. పోలీసుల వాహనాల తనిఖీలో దొరికి కటకటాల పాలయ్యారు. ఆ వివరాలను బుధవారం పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ జగదీష్‌రెడ్డి వెల్లడించారు. పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన బోయ సురేష్, తొండ హరికృష్ణ, మల్దకల్ మండలం దాసరిపల్లి గ్రామానికి చెందిన బోయ మహేష్ ముగ్గురు కలిసి ఫిబ్రవరి 21న బున్యాదిపూర్ గ్రామ శివారులో జూరాల డి–19 కాల్వపై ఉన్న రెండు విద్యుత్ మోటర్లు చోరీ చేశారు. 23న చిన్నంబావి మండలం వెలగొండ గ్రామ శివారులో జూరాల ప్రధాన కాల్వపై ఉన్న ఐదు విద్యుత్ మోటార్లను చోరీ చేసి బోయ సురేష్‌కు చెందిన ఆటోలో వారి స్వగ్రామం గుమ్మడంలో దాచారు. 25న శ్రీరంగాపూర్ మండలం వెంకటాపూర్, నాగసానిపల్లి గ్రామాల మధ్య ఉన్న జూరాల కాల్వపై రెండు మోటార్లు, 26న పెబ్బేరు మండల పరిధిలోని అయ్యవారిపల్లి, బూడిదపాడు గ్రామాల మధ్య ఉన్న వ్యవసాయ బావులపై ఉన్న మూడు, అదేరోజు బూడిదపాడు శివారులో వాగుపై ఉన్న రెండు, మార్చి 3న వెంకటాపూర్, శ్రీరంగాపూర్ గ్రామాల మధ్య జూరాల చిన్నకాల్వపై మూడు విద్యుత్ మోటార్లను అపహరించారు. మోటార్లను విక్రయిస్తే అనుమానం వస్తుందని భావించి, వాటిని పగులగొట్టి పాత ఇనుప సామాను కొనేవారికి విక్రయించాలని అనుకున్నారు. వెంకటాపూర్ గ్రామ శివారులో దొంగిలించిన మూడు మోటార్లను ముందుగా గుమ్మడం గ్రామశివారులో చెట్లపొదలో ఒక పెద్ద సుత్తెతో పగలగొట్టి వాటిని మొత్తం విడి భాగాలుగా చేసి, మూడు విద్యుత్ మోటార్లలో ఉన్న రాగి వైరును విడదీసి 4వ తేదీన ఆటోలో వేసుకొని పెబ్బేరులో విక్రయించాలని బయలుదేరారు. కొల్లాపూర్ చౌరస్తాకు రాగానే పోలీసులు వాహనాల తనిఖీల్లో వారిని అనుమానించి పట్టుకున్నారు. ముగ్గురినీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో విచారణ చేయడంతో మోటార్ల చోరీని ఒప్పుకున్నారు. ఈ మేరకు 17 విద్యుత్ మోటార్లను, మూడు మోటార్ల విడిభాగాలు స్వాధీనం చేసుకున్నారు. 14 మోటార్లను సీజ్ చేశారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి

అయిజ: వీధికుక్కల దాడిలో 12 గొర్రె పిల్లలు మృతిచెందగా, 20 గొర్రె పిల్లలు గాయపడిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుడు మునుస్వామి కథనం ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున పట్టణ శివారులోని కట్టకింది తిమ్మప్పస్వామి ఆలయ సమీపంలో ఉన్న వ్యవసాయ పొలంలో నిలిపిన గొర్రెలపై వీధికుక్కలు దాడిచేడంతో 12 గొర్రె పిల్లలు చనిపోయాయి. 20 గొర్రె పిల్లలకుపైగా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇటీవల కుక్కల దాడుల్లో మూగజీవాలు, ప్రజలు గాయాలపాలవుతున్నారని ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. బాధితుడికి ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు.

పెద్ద చెరువులో మొసలి కలకలం



మాగనూర్: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో బుధవారం మొసలి కలకలం రేపింది. కొన్నాళ్ల కిందట ఇదే ముసలి చెరువులో కనిపించగా, గ్రామస్తులు అటు వైపు పశువులను తీసుకెళ్లకుండా ఉన్నారు. ప్రస్తుతం చెరువులో నీళ్లు తగ్గడంతో మొసలి కనిపించినట్లు తెలిపారు. అటవీశాఖ అధికారులు మొసలిని బంధించి ఇతర ప్రాంతాలకు తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


నవాబుపేట: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పుట్టోనిపల్లితండాలో చోటుచేసుకుంది. మంగళవారం గ్రామానికి చెందిన రాగ్యానాయక్(60) మంగళవారం మేకలను మేపేందుకు తీసుకెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు, కుటుంబ సభ్యులు వెతుకగా.. పొలం వద్ద పశువుల దొడ్డిలో పంచతో ఉరి వేసుకుని కనిపించాడు. మృతుని భార్య లక్ష్మీనాయక్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కుటుంబ పోషణ భారమై మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పురుషోత్తం వివరించారు.

దళిత మహిళలపై కేసులు ఎత్తివేయాలి


మరికల్‌లో మానవహారం చేస్తున్న చిత్తనూర్ గ్రామస్తులు

మరికల్: ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాడుతున్న గ్రామికులు, దళిత మహిళలు, వ్యాపారులపై దాడి చేయడమే కాకుండా అక్రమ కేసులు పెట్టిన ప్రజాప్రతినిధులను అరెస్ట్ చేయాలని బుధవారం చిత్తనూర్ నుంచి మరికల్ వరకు పాదయాత్ర చేపట్టారు. కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో చిత్తనూర్ నుంచి ఎక్లాస్‌పూర్ మీదుగా చేపట్టిన పాదయాత్ర సాయంత్రం మరికల్‌కు చేరుకుంది. చౌరస్తాలో మానవహారం నిర్వహించి తమపై దాడి చేసిన ప్రజాప్రతినిధులను కఠినంగా శిక్షించాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కేఎన్‌పీఎస్ రాష్ట్ర నాయకులు బండారి నర్సప్ప, పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ నాగేష్ మాట్లాడారు. ఇథనాల్ కంపెనీతో కలిగే నష్టాలను వివరిస్తూ.. 54 గ్రామాల్లో పాదయాత్ర చేపట్టి ఆయ గ్రామస్తులకు అవగాహన కల్పించి చైతన్యం పర్చడం జీర్ణించుకోలేని కొందరు ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు గ్రామస్తులపై దాడికి పాల్పడ్డారన్నారు. అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయకుంటే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో చక్రవర్తి, నాగరాజ్, లక్ష్మయ్య, వెంకట్రాములు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన ఉల్లి ధర



దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్ యార్డులో జరిగిన బహిరంగ వేలంలో ఉల్లి ధరలు స్వల్పంగా పెరిగాయి. మూడు వారాలుగా వచ్చిన ధరల కంటే కొంత ఎక్కువ ధరలు పలికాయి. బుధవారం ఉదయం పది గంటల నుంచి జరిగిన బహిరంగ వేలంలో స్థానిక వ్యాపారులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు. మార్కెట్‌కు రైతులు పెద్దఎత్తున ఉల్లిని అమ్మకానికి తీసుకురావడంతో జోరుగా వేలం సాగింది. క్వింటా ఉల్లికి గరిష్ఠంగా రూ.1,260 వరకు ధర పలికింది. కనిష్ఠంగా రూ.650 వరకు ధర లభించింది. గత వారం కన్నా.. రూ.110 గరిష్ఠంగా, రూ.50 వరకు కనిష్ఠంగా ధరలు పెరిగాయి. అయితే తెల్ల ఉల్లికి రూ.వేయిపైనే ధరలు నమోదు కాగా.. ఎర్ర ఉల్లికి మాత్రం రూ.700 లోపే ధరలు వచ్చాయి.

జోరుగా వ్యాపారం..

దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి వ్యాపారం జోరుగా సాగింది. ఇతర మార్కెట్‌ల నుంచి వచ్చిన వ్యాపారులు పెద్ద ఎత్తున ఉల్లిని కొనుగోలు చేశారు. వేలంలో పాల్గొని ధరలు కొంత వరకు పెంచి కొనుగోలు చేసిన ఉల్లిని వాహనాల్లో తరలించారు. స్థానిక వ్యాపారులు కొనుగోలు చేసిన ఉల్లిని నేరుగా విక్రయాలు సాగించారు. చిరు వ్యాపారులు, వినియోగదారులతో మార్కెట్ సందడిగా మారింది. 45 కిలోల ఉల్లి బస్తాను గరిష్ఠంగా రూ.650, కనిష్ఠంగా రూ.350 వరకు విక్రయించారు.





రాష్ట్ర ప్రభుత్వం, మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో కన్నె శంకరమ్మ (కిన్నెర- ఫోక్), గూడూరు మనోజ (ఆధ్యకళ) మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా విశిష్ట సేవ పురస్కారం అందుకున్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారోకో


శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

మన్ననూర్: శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్‌లో ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ పార్టీ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోలీసుల అండతో నియంత పాలన కొనసాగిస్తుందని అన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం ఆత్మహత్య చేసుకున్న నిఖిత మృతిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం , రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితుల తరపున ఉండాల్సిన ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పోలీసుల సహకారంతో ఆ కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేసి దళితబంధు ఇస్తామని చెప్పి చేతులు దులుపుకొంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని అన్నారు. పోలీసులకు ఐపీసీ సెక్షన్‌పై ఏమాత్రం గౌరవం ఉన్నా.. నియోజకవర్గంలో ఎన్నో అక్రమాలు, హెచ్చరికలు చేస్తూ.. ఎంతో మందిపై దాడులు చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజుపై రౌడీ షీట్ కేసు నమోదు చేయాలన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు కల్పించినా బాధిత కుటుంబానికి సరైన న్యాయం జరిగేంత వరకు దశలవారీగా ఆందోళన చేపడుతామని అన్నారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అన్వేష్‌గౌడ్ మాట్లాడారు. న్యాయం కోసం మాట్లాడే ప్రతిపక్షాలపై పోలీసులు లాఠీచార్జి చేసి, కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం ఏ ఒక్కరి సొత్తు కాదననేది గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

పాఠశాల గేటు ఎదుట ఆందోళన...

విద్యార్థిని అఖిల ఆత్మహత్యపై పాఠశాల ప్రిన్సిపాల్ లలితా కుమారి చేసిన ఆరోపణలను ఖండిస్తూ బాధిత కుటుంబం, బంధువులు పాఠశాల గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రిన్సిపాల్, గీతారాణి వచ్చి క్షమాపణ చెప్పేంత వరకు కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. ఎట్టకేలకు ఆర్‌సీఓతో మాట్లాడి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. రహీం, శ్రీనివాసులు, రామాంజనేయులు, బాలమ్మ, అన్వేష్‌గౌడ్, సంతోష్, లడ్డు యాదవ్, జగన్, హరినారాయణగౌడ్, రేణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

విశాఖలో ప్రతిష్టాత్మక ఐసీఐడీ 25వ కాంగ్రెస్

- 75వ ఐఈసీ సమావేశం కూడా...
- నవంబర్ 1 నుంచి 8 వరకు ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహణ

సాక్షి, అమరావతి: ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసీఐడీ) 25వ కాంగ్రెస్‌కు విశాఖపట్నంను వేదికగా ఆ సంస్థ ఎంపిక చేసింది. నవంబర్ 1 నుంచి 8 వరకు ఈ సమావేశాలను ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఇందులో భాగంగానే ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఐఈసీ) 75వ సమావేశాన్ని కూడా ఐసీఐడీ నిర్వహిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయంలో నీటి ఎద్దడిని సమర్థంగా ఎదుర్కోవడమే ఈ కాంగ్రెస్ ప్రధానఎజెండా. ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో గత అక్టోబర్ 3 నుంచి 10 వరకు ఐసీఐడీ 24వ కాంగ్రెస్, 74వ ఐఈసీ సమావేశాలు జరిగాయి. ఐసీఐడీ 25వ కాంగ్రెస్‌ను మన రాష్ట్రంలోని విశాఖపట్నంలో నిర్వహించాలని ఆ సంస్థ నిర్ణయించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కాంగ్రెస్‌ను ఘనంగా నిర్వహిస్తామని రాష్ట్ర ప్రతినిధి బృందం అడిలైడ్ కాంగ్రెస్‌లో తెలిపింది. విశాఖ కాంగ్రెస్‌కు హాజరుకావాలని 78 దేశాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆహ్వానించింది. వ్యవసాయంలో నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కొనే విధానాలను ప్రతిపాదిస్తూ నివేదికలను ఏప్రిల్ 30 లోపు పంపాలని ఆ సంస్థ పేర్కొంది. ఇందులో అత్యుత్తమ విధానాలపై 25వ కాంగ్రెస్‌లో చర్చించనుంది.

మే 15 నుంచి ఏపీఈఏపీసెట్

ఈసెట్ మే 5న, ఐసెట్ మే 24 నుంచి నిర్వహణ

సాక్షి, అమరావతి: ఏపీలో 2023–24 విద్యా సంవత్సరంలో కీలకమైన ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఎంట్రన్స్ టెస్టుల షెడ్యూల్‌ను ఏపీ ఉన్నత విద్యా మండలి ఖరారు చేసింది. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ ఈఏపీసెట్ (ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్), లేటరల్ ఎంట్రీ (డిప్లొమా విద్యార్థులు ఇంజనీరింగ్ రెండో ఏడాదిలో ప్రవేశం)కి సంబంధించిన ఈసెట్, ఎంసీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం ఐసెట్ నోటిఫికేషన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తు, పరీక్షల నిర్వహణ తేదీలను నిర్ణయించింది. ఈ మేరకు షెడ్యూల్ వివరాలను ఉన్నత విద్యా మండలి బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈఏపీసెట్ పరీక్షలను మే 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈసెట్ మే 5న, ఐసెట్ మే 24, 25 తేదీల్లో నిర్వహిస్తారు.

బొబ్బిలి వీణ.. శిఖరాగ్ర ఆదరణ

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరైన అతిథులకూ ఇవే బహుమతి
- రాష్ట్రపతి భవన్ నుంచి.. వైట్‌హౌస్ వరకు బొబ్బిలి వీణలకు స్థానం
- 300 ఏళ్లనాటి చారిత్రక సంపదగా జియోగ్రాఫికల్ గుర్తింపు దక్కించుకున్న బొబ్బిలి వీణ

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రపంచంలో ప్రతిష్టాత్మకమైన 20 సభ్యదేశాల శిఖరాగ్ర సమావేశాల్లో బొబ్బిలి వీణ వైభవాన్ని చాటుకోనుంది. విశాఖలో ఈ నెల 28, 29వ తేదీల్లో జరగనున్న జీ–20 సదస్సుకు వివిధ దేశాల నుంచి హాజరయ్యే అతిథులను గౌరవించేందుకు 200 బొబ్బిలి వీణలను అధికారులు ప్రత్యేకంగా తయారు చేయిస్తున్నారు. కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశం ఉన్నందున ఆయన చేతుల మీదుగా వీటిని ప్రపంచం నలుమూలల నుంచి



జీ-20 దేశాల అతిథుల కోసం 200 వీణలకు ఆర్డర్

వచ్చే అతిథులకు అందించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. విశాఖలో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు దేశం నలుమూలల నుంచి హాజరైన పారిశ్రామిక దిగ్గజాలు, ఔత్సాహికులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున బొబ్బిలి వీణలను బహూకరించారు. బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లికి చెందిన సర్వసిద్ధి ఇంటిపేరు గల కుటుంబీకులే దశాబ్దాలుగా బొబ్బిలి వీణలను తయారుచేస్తూ వస్తున్నారు. వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ద్వారా 1994వ సంవత్సరంలో సొసైటీని ఏర్పాటు చేసింది. 2002లో బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లిలో వీణల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది

వీణల తయారీయే ఆధారంగా ఉన్న మా కళాకారులకు టీటీడీతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు సందర్భంలో 200 వీణలను తయారుచేసి అందించాం. అతిథుల కోసం మా వీణలతో కవేరీ కూడా ఏర్పాటు చేయించారు. ఈ నెలలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న మరో ప్రతిష్టాత్మక సదస్సు జీ–20 కోసం కూడా 200 వీణలకు ఆర్డర్ వచ్చింది.

– సర్వసిద్ధి రామకృష్ణ, ఇన్‌చార్జి, బొబ్బిలి వీణల కేంద్రం

వీణల ధరలు ఇలా..

వీణ సైజు (అంగుళాల్లో)	రకం	ధర	ప్యాకింగ్‌తో ధర
9	సాధారణ	రూ.1,200	రూ.1,430
13	సాధారణ	రూ.1,900	రూ.2,300
17	సాధారణ	రూ.2,200	రూ.2,700
23	సాధారణ	రూ.3,600	రూ.4,500
9	నెమలి	రూ.1,800	రూ.2,200
17	నెమలి	రూ.2,900	రూ.3600
9	స్వరమాపది	రూ.2,000	రూ.2,500
పెద్దవీణ	(సరస్వతివీణ)	రూ.32,000	--

నిఘా పెంచండి... నివేదికలివ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

దృష్టి పెట్టాలని జిల్లా అధికారులు ఆదేశాలు వెళ్లాయి. మార్కులు తక్కువ వస్తున్న విద్యార్థులను మానసికంగా వేధించడం, ఇతర కాలేజీల నుంచి పరీక్షలు రాయించే చర్యలపైనా ఫిర్యాదులున్నాయి. వాటిని పరిశీలించాలని బోర్డు ఆదేశించింది.

వాటిపై మరింత దృష్టి..

- అకాడమీల పేరుతో విద్యార్థులను చేర్చుకోవడం బోర్డు నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ కొన్ని కాలేజీలు ఆయా విద్యార్థులను ఇతర కాలేజీల పేరిట పరీక్షలు రాయిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో ఏ కాలేజీ ద్వారా ఏ అకాడమీ విద్యార్థుల చేత పరీక్షలు రాయిస్తున్నారనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు.
- చాలా ప్రైవేటు కాలేజీలపై గతంలో అవకతవకల ఆరోపణలు వచ్చినా చర్యలు తీసుకోకుండా అడ్డుకున్న అధికారులెవరు? వారికి సహరించిన యాజమాన్యాలు, వ్యక్తులు ఎవరు? ఈ తంతులో ఎంత మేర ముడుపులు చేతులు మారాయి? అనే వివరాలనూ తెలుసుకుంటున్నారు.
- కొన్నేళ్లుగా కొందరు బోర్డు అధికారులు, కొన్ని కాలేజీల యాజమాన్యాల మధ్య మధ్యవర్తిత్వం వహించిన వారి ప్రమేయం, సాగించిన అవినీతి కార్యకలాపాలపై సమగ్ర నివేదికను రూపొందిస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి..



విద్యార్థులకు నష్టం కలిగించే కాలేజీలపై కొరడా ఝుళిపించాలి. ర్యాంకుల కోసం విద్యార్థులను వేధిస్తున్న, నిబంధనలను అతిక్రమిస్తున్న కాలేజీలపై కఠిన చర్యల విషయంలో బోర్డు చిత్తశుద్ధితో వ్యవహరించాలి.

– గౌరీ సతీశ్ (ప్రైవేటు కాలేజీల యాజమాన్య సంఘం అధ్యక్షుడు)

అవినీతి అధికారులను తొలగించాలి



విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తూ ర్యాంకులతో ప్రచారం చేసుకుంటున్న కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల ఆగడాల వెనుక కొందరు బోర్డు అధికారుల ప్రమేయం ఉంది. అవినీతికి పాల్పడుతూ ఆయా సంస్థలను వెనకేసుకొచ్చిన అధికారులను గుర్తించి తొలగించాలి.

– మాచర్ల రామకృష్ణగౌడ్ (తెలంగాణ ఇంటర్ విద్య పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్)

ఒకే విడతలో 1.34 లక్షల ఉద్యోగాలిచ్చిన ప్రభుత్వమిది

- ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొనం
- ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: 'ఏపీలో రికార్డు స్థాయిలో ఒకే విడతలో తమలాంటి 1.34 లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలిచ్చిన ప్రభుత్వం ఇది. ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే నిరసనలు, ఆందోళనల్లో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులం పాల్గొనం'అని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టంచేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానిపాషా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే ఎవరూ ఊహించని విధంగా చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో బృహత్తర ఆలోచనతో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి 1.34 లక్షల మంది యువతకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారు. ఈ 1.34 లక్షల కుటుంబాలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేసిన మేలును మా ఉద్యోగులెవరూ ఎప్పటికీ మరువలేరు. రాష్ట్రంలో కొంతమంది ఉద్యోగ సంఘాల నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఉద్యోగ వ్యవస్థలో సింహ భాగంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను తప్పుదోవ పట్టించేలా రెచ్చగొడుతూ, ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు పాల్పడేలా చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నాం. సచివాలయ ఉద్యోగులు ఎవ్వరూ ఎటువంటి ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు, ఆందోళనల్లో పాల్గొనవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం'అని పేర్కొన్నారు.

రేపు ఆన్‌లైన్ 'పెన్షన్ అదాలత్'

సాక్షి, హైదరాబాద్: నెలవారీ పెన్షన్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 10వ తేదీన ఉదయం 11గంటలకు ఆన్‌లైన్ పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్టు ఎంప్లాయ్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రాంతీయ కమిషనర్ ఎం.హెచ్.వార్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. https://meet.google.com/cav-esqk-bzm లింకు ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈపీఎస్ చట్టం–95, అధిక పెన్షన్, ఆప్షన్ నమోదు, దరఖాస్తు విధానం తదితర అంశాలను తెలుసుకునేందుకు ఈ అదాలత్ అత్యుత్తమ వేదికని వివరించారు. సందేహాలున్న వారు, సమాచారం తెలుసుకోవాలనుకున్న వారంతా ఆన్‌లైన్ అదాలత్‌లో పాల్గొనాలని సూచించారు.

'స్కిల్' కుంభకోణంలో కీలక వ్యక్తి అరెస్టు

'సీమెన్స్'కంపెనీ మాజీ ఉద్యోగి జీవీఎస్ భాస్కర్‌ను అరెస్టు చేసిన సీఐడీ

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగిన రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో మరో కీలక వ్యక్తిని సీఐడీ అరెస్టు చేసింది. సీమెన్స్ ఇండస్ట్రియల్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ మాజీ ఉద్యోగి జీవీఎస్ భాస్కర్‌ను ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఆయన నివాసంలో బుధవారం అదుపులోకి తీసుకుంది. అనంతరం ఆయన్ని న్యాయస్థానంలో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు తీసుకువస్తున్నారు. జీవీఎస్ భాస్కర్‌తో సహా ఈ కేసులో ఇప్పటివరకు సీఐడీ 8 మందిని అరెస్టు చేసింది. రూ. 371 కోట్ల ప్రజాధానాన్ని చంద్రబాబు ప్రభుత్వ పెద్దలు కొల్లగొట్టడంలో జీవీఎస్ భాస్కర్ ప్రధాన పాత్ర పోషించారని సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. టీడీపీ ప్రభుత్వం సీమెన్స్ కంపెనీ ముసుగులో షెల్ కంపెనీలతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం రూపకల్పనలో ఆయనే కీలకంగా వ్యవహరించారు. సీమెన్స్ ఇండియా లిమిటెడ్‌కు అప్పట్లో ఎండీగా ఉన్న సుమన్ బోస్‌తో కుమ్మక్కై టీడీపీ పెద్దలు ఈ ఎంవోయూ కథ నడిపారు. అందులో భాస్కర్ కీలకంగా వ్యవహరించారు.

'గగన్‌యాన్'లో మహిళా వ్యోమగామికి అవకాశం

షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ వెల్లడి

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 2024లో నిర్వహించబోయే గగన్‌యాన్ ప్రయోగంలో అంతరిక్షంలోకి పంపించడానికి ఒక మహిళకు అవకాశం కల్పించనున్నామని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించబోయే చంద్రయాన్–2 మిషన్‌కు ఒక మహిళే డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. షార్‌లోని ఎంఆర్ కురూప్ ఆడిటోరియంలో బుధవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలో రాజరాజన్ మాట్లాడారు. చంద్రయాన్–2 ప్రయోగంలో కూడా ఎక్కువగా మహిళలే పాల్గొనడం విశేషమన్నారు. స్వయంకృషి, పట్టుదల ఉంటే జీవితంలో మహిళలు కూడా పురుషులకు ఏమీ తీసిపోరని కోయంబత్తూరు పీఎస్‌సీ కళాశాల ఆర్ట్స్ అండ్ సైన్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ జయంతశ్రీ బాలకృష్ణన్ అన్నారు.



మాట్లాడుతున్న రాజరాజన్

అనంతరం షార్ కేంద్రంలోని మహిళలకు, విద్యార్థినులకు పలు రకాల ఆటల పోటీలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ ఆర్ వెంకట్రామన్, షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ ఇంకా షార్‌లో మహిళా ఇంజనీర్లు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

విమానంలో ధూమపానం.. యువతి అరెస్టు

దొడ్డబళ్లాపురం: విమానంలో ధూమపానం చేసిన యువతిని బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం భద్రతా సిబ్బంది అరెస్టు చేశారు. పశ్చిమబెంగాల్‌లోని సీల్దా జిల్లాకు చెందిన ప్రియాంక చక్రవర్తి (24) అనే యువతి ఆదివారం అర్ధరాత్రి కోల్‌కతా నుంచి బెంగళూరు వస్తున్న ఇండిగో విమానంలో ప్రయాణించింది. ఆమె విమానం టాయ్‌లెట్లోకి వెళ్లి ధూమపానం చేయసాగింది. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో సిబ్బంది తలుపులు తెరవాలని కోరగా, ఆమె సిగరెట్‌ను డస్ట్‌బిన్‌లో పారవేసి తలుపులు తీసింది. పొగ వాసన రావడంతో సిబ్బంది తనిఖీ చేయగా డస్ట్‌బిన్‌లో సిగరెట్ దొరికింది. విమానం బెంగళూరులో దిగగానే ఎయిర్‌పోర్టు భద్రతా సిబ్బంది ఆమెను అదుపులోకి తీసుకున్నారు. విమానంలో పొగ తాగడం నేరం కాబట్టి కేసు నమోదు చేసి ప్రియాంకను అరెస్టు చేశారు.

అలంపూర్ ఆలయాల్లో మహిళా దినోత్సవం



మహిళా ఉద్యోగులతో ఆలయ ఈఓ, అర్చకులు, ఉద్యోగులు

జోగుళాంబ శక్తిపీఠం: ఎక్కడ స్త్రీలు పూజించబడతారో అక్కడ దేవతలు చరిస్తారని జోగుళాంబ దేవస్థానం ఈఓ పురేందర్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆలయంలో పనిచేసే మహిళా ఉద్యోగులకు ఆయన చీరలు, స్వీట్‌బాక్స్‌లు అందజేశారు. ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రంగనాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని శాశ్వతంగా కొనసాగించాలని ఉద్యోగులకు సూచించారు. ఆలయ ముఖ్య అర్చకుడు ఆనంద్‌శర్మ మాట్లాడుతూ.. రుగ్వేదంలోని దేవి సూక్తంలో స్త్రీని విశ్వశక్తిగా, ఉపనిషత్తులు, శాస్త్రాలు సాధికారత కలిగిన స్వరూపంగా పేర్కొని స్త్రీ ఔన్నత్యాన్ని ప్రశంసించిందని గుర్తు చేశారు. జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. స్త్రీని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్ మాట్లాడుతూ.. ఆలయంలో మహిళా ఉద్యోగులకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పెద్దపీట వేయాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ బ్రహ్మయ్య ఆచారి, రికార్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో గురుకుల ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్లు

మన్ననూర్/కల్వకుర్తి టౌన్: రాష్ట్రవ్యాప్తంగా గిరిజన గురుకుల కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ఈ నెల 12వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు మన్ననూర్ పీటీజీ పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, కల్వకుర్తి గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కీర్తి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు httpr:ttwreir.ac.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, ప్రతి విద్యార్థి పరీక్ష కేంద్రానికి గంట ముందే హాజరుకావాలని, హాల్ టికెట్, ప్యాడ్, బ్లాక్ లేదా బ్లూ పెన్, ఆధార్‌కార్డు జిరాక్స్ వెంట తీసుకురావాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష హాల్‌లోకి అనుమతించబడవని పేర్కొన్నారు.

రమణీయం.. రథోత్సవం

వైభవంగా అలివేలు మంగతాయారు రథోత్సవం

- ఘనంగా గరుడ, అశ్వవాహన సేవలు
- భక్తి పారవశ్యంతో పులకించిన భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీ అలివేలు మంగతాయారు రథోత్సవం (విమాన రథోత్సవం) మంగళవారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా శోభాయమానంగా అలంకరించిన గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగతాయారు దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ఉంచి గరుడసేవ నిర్వహించారు. గర్భగుడి నుంచి సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రోచ్చారణల నడుమ ప్రధాన ద్వారం నుంచి ఆలయ ఆవరణలోని రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం రథం ముందు కుంభం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవగుండు వరకు..

రంగురంగుల పూలు, విద్యుద్దీపాలు, మామిడి తోరణాలతో ముస్తాబు చేసిన రథంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచగా.. భక్తులు నినాదాలు చేస్తూ ముందుకు లాగారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు రథాన్ని లాగి భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. రథాన్ని దేవగుండు వరకు లాగి తిరిగి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. బంగారు ఆభరణాలు, కాగడాలు, విద్యుద్దీపాల వెలుగులో స్వామి, అమ్మవార్లు మెరిసిపోతూ భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవ సమయంలో పెద్దఎత్తున బాణసంచా కాల్చారు.

ఆకట్టుకున్న కోలాటం..

గరుడ వాహనసేవలో ఓబ్లాయపల్లికి చెందిన భజనమండలి సభ్యులు ఎప్పటిలాగే కోలాటాలు, భజనలు చేశారు. అలాగే నిర్వహించిన నాటక ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. రథోత్సవం అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను తిరిగి గరుడ వాహనంపై గర్భగుడి వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అశ్వవాహనసేవ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, అర్చకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



గరుడ వాహనసేవలో పాల్గొన్న భక్తులు



మన్యంకొండ రథోత్సవంలో హారతి ఇస్తున్న అర్చకుడు

నేడు వసంతోత్సవం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వసంతోత్సవం, పూర్ణాహుతి, అవభృతస్నానం, రాత్రి నాకబలి (నాగవెల్లి), ద్వాదశారాధన, మహదాశీర్వచనం నిర్వహించనున్నారు. దీంతో అమ్మవారి ఉత్సవాలు ముగుస్తాయి.

కమనీయం.. వట్టెం వెంకన్న కల్యాణం



గరుడ వాహనసేవలో భక్తులు

బిజినేపల్లి: మండలంలోని వట్టెం వేంకటేశ్వర స్వామి తృతీయ పుష్కర బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణం కనులపండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చక బృందం స్థానాచార్యులు శ్రీమన్నారాయణ, ప్రధాన అర్చకుడు శ్రీకృష్ణస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తంతులో రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ అనంత నర్సింహారెడ్డి దంపతులు ప్రత్యేక తలంబ్రాలు సమర్పించగా.. ఉప్పల కృష్ణయ్య దంపతులు పట్టువస్త్రాలు అందజేశారు. అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ అలమేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఎంపీ రాములు, జెడ్పీటీసీ సభ్యుడు భరత్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

ఉద్దాల సమర్పణ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం చతుస్థానార్చన, అర్చన, ప్రాతఃరాధన.. సాయంత్రం ఉద్దాల సమర్పణ, ఎద్దులబండ్ల ఊరేగింపు, గరుడ వాహనసేవ నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

మార్మోగిన శివనామస్మరణ

కందూరు రామలింగేశ్వరుడి రథోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో స్వయంభువుగా వెలిసిన రామలింగేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి నిర్వహించిన రథోత్సవం కనులపండువగా సాగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మార్మోగాయి. మంగళవారం రాత్రి కందూరు గ్రామం నుంచి స్వామివారి వెండి ముఖం, నాగపడగలను మంగళ వాయిద్యాలు, బాణసంచా కాలుస్తూ ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అర్చకులు వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించి లోనికి తీసుకెళ్లి శివలింగానికి అలంకరించారు. అనంతరం ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలతో బయటకు తీసుకొచ్చి రథంపై ఉంచారు. అర్చకులు రామలింగశర్మ, యాదగిరిశర్మ, మణికంఠశర్మ, సందీప్‌శర్మ, నాగలింగం, శివ రథం ఎదుట పాలి పోసి, రథాంగ హోమం నిర్వహించి హారతి ఇచ్చారు. తెల్లవారుజామున అశేష భక్తజనం శివనామస్మరణ చేస్తూ మేళతాళాల చప్పుళ్ల నడుమ స్వామివారి రథాన్ని భక్తిశ్రద్ధలతో లాగారు. రథం ముందు భక్తుల భజనలు, కోలాట ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. ఎస్‌ఐ విజయకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా దేవరకద్ర మండలం నార్లోనికుంటకు చెందిన భజనబృందం చేసిన కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ వి.శ్రీకాంత్, ఎంపీటీసీ సభ్యురాలు శ్యామలమ్మ, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, ఈఓ రాజేశ్వరశర్మ, ఆలయ సిబ్బంది అనంతసేన్‌రావు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, రమేష్, చంద్రమౌళి, చల్మారెడ్డి, రాములు పాల్గొన్నారు.



ప్రధాన ఆలయంలో అలంకరించిన శివలింగానికి హారతి ఇస్తున్న అర్చకుడు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అశ్వవాహనంపై రంగనాథస్వామి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి అశ్వవాహన సేవ ఘనంగా నిర్వహించారు. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ మూలమంత్ర హోమం, రాత్రి పారుపేట, అశ్వవాహనసేవ నిర్వహించారు. అశ్వవాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి తిరువీధుల్లో ఊరేగించారు. భక్తులు గోవింద నామస్మరణతో కార్యక్రమాన్ని వీక్షించారు. వేడుక అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు విష్ణునారాయణ, అర్చకులు గోవిందాచార్యులు, సురేషాచార్యులు, కన్నయ్య స్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అశ్వవాహనంపై శ్రీదేవి,భూదేవి సమేత రంగనాథస్వామి